సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 31 । ఆగస్టు । 2024



ఘనంగా శ్రావణ లక్ష్మీ పూజలు
శ్రావణమాసం చివరి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. 8లో



340 కిలోల గంజాయి స్వాధీనం
విశాఖ జిల్లా ఆనందపురం మండలంలో పోలీసులు 340 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో



ప్రకృతిని ప్రేమిద్దాం 8లో
మానవులందరూ ప్రకృతిని ప్రేమించడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలని జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన ఐటీడీఏ పీవో అపూర్వభరత్



చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన అపూర్వభరత్

చింతూరు: స్థానిక ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్‌గా అపూర్వభరత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అపూర్వభరత్ అనంతపురం జిల్లా పెనుగొండ సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా చింతూరు డివిజన్ సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అపూర్వభరత్ మాట్లాడుతూ డివిజన్‌లో గిరిజనుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పీవీటీజీల అభివృద్ధికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

మారేడుమిల్లి : పీవీజీటీల అభివృద్ధికి, జీవనోపాధి మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మండలంలోని ఆకుమామిడికోటలో శుక్రవారం నిర్వహించిన పీఎం జన్‌మన్ పథకం గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పీవీటీజీల గ్రామాలకు రహదారులు, విద్యుత్, తాగునీరు సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుల మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను గ్రామస్తులు అందజేశారు. డివిజన్ పంచాయతీ అధికారి రఘునందన్, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు, ఎంపీడీవో వీర కిషోర్, ఏపీవో రెడ్డి బాబు, పరిపాలనాధికారి జయంతి పాల్గొన్నారు.

వీడియో గ్రాఫర్ల ఆందోళన

- ఎన్నికల బిల్లులు చెల్లించాలని డిమాండ్



రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీడియోగ్రాఫర్లు

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీడియో, ఫొటో గ్రాఫర్లు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐదు నెలలుగా బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పెరిగిన అల్లం ధర



వారపుసంతలో అల్లం బస్తాలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకులో శుక్రవారం నిర్వహించిన వారపు సంతలో అల్లం ధరను పెంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. గత వారం కిలో అలం రూ.70 నుంచి రూ.80 కొనుగోలు చేయగా, ఈ వారం దేశవాళీ రూ.100, హైబ్రీడ్ రకం రూ.110 ధరతో మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈసీజన్‌లో అత్యధికంగా లభించే వెదురు కొమ్ములను వాట రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయించి గిరిజనులు ఆదాయం పొందారు. ఒడిశా రాష్ట్రం నుంచి తీసుకువచ్చి విక్రయించిన మిరపకాయల ధర అధికంగా ఉండడంతో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురాలేదు. చిన్న బుట్ట రూ.50, పెద్ద బుట్ట మిరపకాయలు రూ.100కు విక్రయించారు.

హాస్టల్‌లో హాహాకారాలు

- జామిగుడ ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 79 మందికి అస్వస్థత
- అరకులోయ ఏరియా ఆస్పత్రిలో 61 మందికి చికిత్స
- ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం



అరకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు



హాస్టల్ ఆవరణలో విద్యార్థినికి సెలైన్ ఎక్కిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి,పాడేరు/అరకులోయరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్‌పాయిజన్ కేసులు విద్యార్థుల తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. చదువుకోసం వెళ్లిన తమ పిల్లలు ఆస్పత్రి పాలవుతుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో దాదాపు వేయి మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ ట్రస్ట్ ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందగా, పలువురు ఆస్పత్రిపాలయ్యారు. ఆ సంఘటనలు మరవక ముందే తాజాగా జిల్లాలోని డుంబ్రిగుడ మండలం జామిగుడ గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమపాఠశాలలో శుక్రవారం రాత్రి ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థినులు ఆస్పత్రిపాలు కావడం తల్లిదండ్రులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. వివిధ గ్రామాలకు చెందిన గిరిజన విద్యార్థినులు ఈ పాఠశాలలో వసతితో కూడిన విద్య పొందుతున్నారు. వీరంతా శుక్రవారం రాత్రి యథావిధిగా గుడ్డు, రసంతో భోజనం చేశారు. తిన్న కొద్ది సేపటికి వీరిలో 79 మంది అస్వస్థతకు గురికాగా 61 మందిని అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు. ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

ఏం జరిగింది...

శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా పలువురు విద్యార్థినులు వాంతులు చేసుకోవడంతో హుటాహుటిన వారిని అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.రాత్రి 12 గంటల వరకు 61 మంది విద్యార్థినులకు అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించగా,వీరిలో సౌజన్య,జెస్సీ,దీవెనల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.మిగిలిన 18 మంది విద్యార్థినులకు జామిగుడ ఆశ్రమ పాఠశాలలో కిల్లోగుడ వైద్య సిబ్బంది





అరకు ఏరియా ఆస్పత్రిలో బాలికలకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ భోజనం చేసిన వెంటనే వికారంగా అనిపించిందని చెప్పారు.ఆ వెంటనే వాంతులు చేసుకున్నామని తెలిపారు.

ఐదుగురితో మొదలు..

జామిగుడ ఆశ్రమ పాఠశాలలో 650 మంది గిరిజన బాలికలు చదువుతున్నారు.వీరందరికీ గుడ్డు కూర, రసంతో కూడిన భోజనాన్ని వడ్డించారు. తొలుత 6వ తరగతికి చెందిన ఐదుగురు బాలికలకు వాంతులు అవడంతో వారిని కిల్లోగుడ పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు. ఆ తర్వాత ఒక్కసారిగా ఎక్కువ మంది పిల్లలకు వాంతులవడంతో విద్యార్థినులంతా ఆందోళన చెందారు.79మంది అస్వస్థతకు గురికావడంతో అంబులెన్స్‌లలో అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి 12 మంది డాక్టర్లు వైద్యసేవలు అందించారు. సహాయక చర్యల్లో అరకులోయ సీఐ హిమగిరి పాల్గొన్నారు.

ఆలస్యంగా అధికారులు

జామిగుడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటనపై అధికార యంత్రాంగం ఆలస్యంగా స్పందించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి,కిల్లోగుడ పీహెచ్‌సీ వైద్యబృందాలు, ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు సకాలంలో స్పందించినప్పటికీ అధికారులు మాత్రం అరకులోయకు చేరుకోలేకపోయారు.డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా మాత్రమే రాత్రి 10 గంటల సమయంలో అరకులోయ ఆస్పత్రికి చేరుకున్నారు. గిరిజన సంక్షేమ డీడీ, ఇతర అధికారులు మాత్రం రాత్రి 12గంటల తర్వాతే ఆస్పత్రిని సందర్శించారు.

నాసిరకం గుడ్ల వల్లే !

విద్యార్థినులకు వండిపెట్టిన కోడిగుడ్లలోనే తేడా ఉండవచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. నాసిరకం గుడ్లు కావడంతో వాటిని తిన్న విద్యార్థినులు అస్వస్థతకు గురై ఉండవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా చెప్పారు.

ఆహార శాంపిళ్ల సేకరణ



ఆహార నమూనాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

విద్యార్థినులు తిన్న కోడిగుడ్డు కూర,రసం, అన్నం శాంపిళ్లను డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా సేకరించారు.వాటిని పరీక్షలకు పంపనున్నారు.

గంజాయి, సారా నిర్మూలనకు కృషి

ఎస్పీ అమిత్ బర్దర్



పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎస్పీ అమిత్ బర్దర్, చిత్రంలో ఏఎస్పీ ధీరాజ్

హుకుంపేట: గంజాయి, సారా నిర్మూలనకు కృషి చేయాలని ఎస్పీ అమిత్‌బర్దర్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి, వాటి వివరాలను తెలుసుకున్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా, గంజాయి తయారీ, రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం ద్వారా విక్రయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ధీరాజ్, సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

అటవీ ఫలసాయాల ద్వారా ఆర్థికాభివృద్ధి



ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటుతున్న పంచాయతీ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రమిత్ మౌర్య

మారేడుమిల్లి : జిల్లాలో గిరిజనులు అటవీ ఫలసాయాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని, పంచాయతీ రాజ్ రూరల్ డెవల్‌మెంట్ డైరెక్టర్ రమిత్ మౌర్య అన్నారు. మండలంలోని చావడికోట పంచాయతీ బంద గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడి పీవీటీజీ గిరిజనులతో అటవీ ఫలసాయాలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా ఆయనకు గిరిజన సంప్రదాయాలతో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఆయన గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అటవీ ఫలసాయలైన కొండ చీపుళ్లు, చింతపండు, జాఫ్రాలు, బొబ్బర్లు, కొర్రలు, సామలు, అడవి దుంపలు, చామకూర, గోంగూర, వెదురు కొమ్ములు తదితరాలు ముఖ్య జీవనాధారమని వారు వివరించారు. ఈ సందర్భంగా రమిత్ మౌర్య మాట్లాడుతూ అటవీ ఫలసాయ పంటలు మరింత అభివృద్ధి చెందేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వపరంగా అందాల్సిన రాయితీలను అందిస్తామని గిరిజనులకు తెలిపారు. అనంతరం బంధ ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. ఆకుమామిడికోటలో జరిగిన వారపు సంతలో విక్రయిస్తున్న అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి ఎస్.వి.రాఘవన్, ఎంపీడీవో వీర కిషోర్, పరిపాలన అధికారి జయంతి, ఏపీవో రెడ్డి బాబు, ఈవోపీఆర్‌డీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జోరుగా వర్షాలు

రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్



పాడేరు సంతరోడ్డులో కురుస్తున్న వర్షం



అప్పలరాజుపేటలో జోరుగా కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లా కేంద్రం పాడేరులో మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి భారీ వర్షం కురవడంతో పాడేరులోని వారపుసంతకు ఆటంకం ఏర్పడింది. చిరు వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించా యి. దీంతో రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ అప్రమత్తం చేశారు.

వర్షపాతం వివరాలు .. : జి.మాడుగుల మండలంలో 46.8 మిల్లీమీటర్లు, చింతూరు 38.8, మారేడుమిల్లి 25.6, కూనవరం 25.6, అనంతగిరి 24.4, అరకులోయ 21.2, ముంచంగిపుట్టు 18.8, పాడేరు 16.8, రంపచోడవరం 16.4, ఎటపాక 14.2, చింతపల్లి 12.6, పెదబయలు 10.8, వీఆర్ పురం 10.4, దేవీపట్నం 10.6, హుకుంపేట 7.8, వై.రామవరం 4.8, అడ్డతీగల 5.6, రాజవొమ్మంగి 5.6, జీకే వీధి 5.2, గంగవరం మండలంలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మొక్కలతోనే భావితరాల మనుగడ

కలెక్టర్ దినేష్‌కుమార్



ఏపీఆర్ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: మొక్కలతోనే భావితరాల మనుగడ, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక కుమ్మరిపుట్టులోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో అటవీశాఖ శుక్రవారం ఘనంగా నిర్వహించింది. కలెక్టర్‌తో పాటు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్ మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ, ఐటీడీఏ పీవోలు జ్యోతిప్రజ్వలన చేసి వనమహోత్సవ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 33 శాతం అడవులు ఉండాలని, అయితే 23శాతం మాత్రమే ఉన్నాయన్నారు. మొక్కల పెంపకంతో పాటు వన్య ప్రాణుల సంరక్షణకు అందరూ కృషి చేయాలని చెప్పారు. 2040 నాటికి 1.5 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు, 2100 సంవత్సరానికి 7డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగి భూమిపై సకల జీవరాసులు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ ప్రతి వేడుకలోను మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. వన్య ప్రాణాలను రక్షించాలని ఆయన కోరారు. జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషిచేయాలన్నారు. పోడు వ్యవసాయం ద్వారా అడవులు కనుమరుగు కాకుండా గిరిజనులకు అటవీ హక్కులు కల్పిస్తున్నట్టు చెప్పారు. డీఎఫ్‌వో వినోద్‌కుమార్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 35వేల మొక్కలను నాటుతున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులతో వనమహోత్సవ ప్రతిజ్ఞ చేయించి, ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఏపీఆర్ విద్యార్థినులు పలు నృత్యరూపకాలు ప్రదర్శించారు. డీఆర్‌వో పద్మావతి, డీఈవో పి.బ్రహ్మాజీరావు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈలు బాలసుందరబాబు, కొండయ్య పడాల్, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, అరకు సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, పాడేరు, పెదబయలు, జి.మాడుగుల రేంజి అధికారులు శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, ఆర్.అప్పలనాయుడు, సర్పంచ్‌లు వంతాల సీతమ్మ, కొట్టగుల్లి ఉషారాణి, సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీలు గంగరాజు, బి.అప్పారావు, మాజీ సర్పంచ్‌లు సరభ సూర్య నారాయణ, మినుముల కన్నాపాత్రుడు, పాంగి నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు డి.పి.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధించిన ఏఎన్‌ఎం, వార్డెన్ సస్పెన్షన్

మారేడుమిల్లి : మండలంలోని బోదులూరు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో వెట్టి చాకిరీ చేయించడంతో పాటు వేధించిన ఏఎన్ఎం కొమరం రామలక్ష్మి, వార్డెన్ బి.మంగయమ్మను సస్పెండ్ చేసినట్టు రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పాఠశాలలోని విద్యార్థినులతో ఏఎన్ఎం, వార్డెన్ పనులు చేయించడమే కాకుండా తీవ్రంగా వేధించారు. తామర, గజ్జి తదితర పలు అంటూ వ్యాధులు ఉన్నాయనే నేపంతో బెత్తాలతో కొట్టడంతో పాటు అసభ్యకర పదజాలాలతో తిడుతున్నారని పలువురు విద్యార్థినులు సర్పంచ్ ప్రేమలత దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె అధికారులకు ఫిర్యాదు చేయగా ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేసినట్లు డీడీ శ్రీనివాసరావు తెలిపారు.

వచ్చే నెల 3న అరకులో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్, పాడేరు, చింతూరు ఐటీడీఏల పీవోలు

పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా వచ్చేనెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు అరకు ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను శుక్రవారం పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, అపూర్వ భరత్‌లు ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్‌ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, మోడరన్ వీర్ సెక్యూరిటీ సర్వీసెస్, మదర్ అండ్ ఫాదర్ తదితర కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతాని చెప్పారు. జిల్లాలో 18 నుంచి 30ఏళ్ల లోపు వయస్సు గల ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిన యువతీ యువకులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలు, పాన్, ఆధార్ కార్డులతో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9177517373 అనే నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మరికొంత కాలం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్ (08557) పూజా స్పెషల్ శనివారాల్లో రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 7 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు నడుస్తుంది. చెన్నై ఎగ్మోర్-విశాఖపట్నం (08558) పూజా స్పెషల్ ఆదివారాల్లో ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 10.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 8 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం- సికింద్రాబాద్(08579) వీక్లీ స్పెషల్ విశాఖలో బుధవారాల్లో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్‌ను నవంబర్ 27 వరకు పొడిగించారు. సికింద్రాబాద్-విశాఖపట్నం (08580) వీక్లీ స్పెషల్ సికింద్రాబాద్‌లో గురువారాల్లో రాత్రి 7.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ నవంబరు 28 వరకు పొడిగించారు.
- విశాఖపట్నం-తిరుపతి(08583)వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతి సోమవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 25 వరకు పొడిగించారు. తిరుపతి-విశాఖపట్నం (08584) స్పెషల్ తిరుపతిలో మంగళవారాల్లో రాత్రి 9.55గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ నేడు, రేపు దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో) దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో కిరండూల్ నుంచి బయల్దేరవలసిన కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది.

ఇండోనేషియా చేరుకున్న ఐఎన్ఎస్ శివాలిక్



ఐఎన్ఎస్ శివాలిక్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న ఇండోనేషియా బృందం

సింథియా: దక్షిణ చైనా సముద్రం, పసిఫిక్ మహా సముద్రంలో కొనసాగుతున్న కార్యచరణ విస్తరణలో భాగంగా ఐఎన్ఎస్ శివాలిక్ నౌక ఇండోనేషియాలోని సుబరియా పోర్టుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇండోనేషియా నావికాదళం అధికారులు, సైనిక బృందం భారత నేవీ బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దీర్ఘకాల స్నేహం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని నేవీ వర్గాలు తెలిపాయి. ఇండోనేషియా నావికాదళంతో ప్రొఫెషనల్ ఇంటరాక్షన్లు, క్రాస్ డెక్ విజిట్లు, క్రీడా పోటీలు, సేవా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

ఘనంగా శ్రావణ లక్ష్మీ పూజలు

సాక్షి,పాడేరు: శ్రావణమాసం చివరి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. పాడేరు పట్టణంలోని మోదకొండమ్మ తల్లి, కనకదుర్గమ్మతల్లి, రాజరాజేశ్వరి ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు. జి.మాడుగులలోని మత్స్యామాడుగులమ్మ, చింతపల్లిలోని ముత్యాలమ్మ,దారకొండలోని దారాలమ్మ,సీలేరులోని మారెమ్మ తల్లి ఆలయాలకు మహిళా భక్తుల అధిక సంఖ్యలో వెళ్లి పూజలు జరిపారు.



రంపచోడవరంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్, ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్



అడ్డతీగలలో మొక్కలు నాటుతున్న సబ్ డీఎఫ్‌వో శ్రీ రామారావు, సిబ్బంది



చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటుతున్న డీఎఫ్‌వో బబిత, ఎంపీపీ సవలం అమల

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

ఘనంగా వన మహోత్సవం

రంపచోడవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా ప్రతి గ్రామంలో మొక్కలు పెంచాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పెర్కొన్నారు. రంపచోడవరంలోని బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ గ్రామాల్లో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. డీఎఫ్ఓ కె.శ్రీవాణి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఫారెస్టు రేంజర్ ఉషారాణి, ప్రిన్సిపాల్ ఎలిషా, ఎఫ్ఎస్ఓ ఎస్.కృష్ణ, విజయదుర్గ పాల్గొన్నారు.

చింతపల్లి: పర్యావరణాన్ని కాపాడడం కేవలం మొక్కలతోనే సాధ్యమవుతుందని చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమం సందర్భంగా చింతపల్లి మండలం పెదబరడా పంచాయతీ పరిధిలో గల కృష్ణాపురంలో అటవీ పర్యాటక కేంద్రంలో చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూషదేవి మాట్లాడుతూ వనాలు పెంపడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించుకునే అవకాశం ఉంటుందన్నారు. జెడ్పీటీసీ బాలయ్యపడాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్రిన్సిపాళ్లు విజయభారతి, రామేశ్వరం, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏపీవో లక్ష్మీనారాయణమూర్తి, ఎంపీటీసీ లోవరాజు, కార్యదర్శులు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరి బాధ్యతని, మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని కాపాడే అవకాశముంటుందని చింతూరు డీఎఫ్‌వో బబిత అన్నారు. వన మహోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీపీ సవలం అమలతో కలసి ఆమె శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో బబిత మాట్లాడుతూ అడవులను నరకడం కారణంగా పర్యావరణం దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో పాటు వన్యప్రాణులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. చెట్లను రక్షించడంలో విద్యార్థులు ప్రధాన భూమిక నిర్వహించాలని ఆమె సూచించారు. వన మహోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాయకులు ఇల్లా చిన్నారెడ్డి, దాసరి రమణారెడ్డి, హెచ్‌ఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరామారావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తాయన్నారు. అటవీ రేంజి పరిధిలోని 1025 మొక్కలు ఒక్క రోజులో నాటించామన్నారు. ప్రతి పాఠశాలలో 25 మొక్కలు నాటడం జరిగిందన్నారు. వీటితో పాటు స్వచ్ఛంద సంస్థలకు 500 మొక్కలు అందజేశాయన్నారు. ప్రతి వ్యక్తి వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటడం , పెంచడం చేయాలని కోరారు. అడ్డతీగల అటవీరేంజి అధికారి షెహన్‌షా బీజేపీ జిల్లా కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథరావు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని అడ్డతీగల పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ బి.నరసింహమూర్తి సిబ్బందితో కలసి శుక్రవారం మొక్కలు నాటారు.



మారేడుమిల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు

మారేడుమిల్లి : డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వీరన్న రాజు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగిల్ స్టార్, వనవిహారి, ఏకో టూరిజం కార్యాలయం, వాలమూరులో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చెట్లు, మొక్కలు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ కొండా జాకబ్, విద్య కమిటీ చైర్మన్ జి. రవికుమార్, జెడ్పీటీసీ పాఠశాల హెచ్‌ఎం ఎ.నీలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు శేషు కుమార్, మాజీ అధ్యక్షుడు అప్పాజీ, జనసేన మండల అధ్యక్షుడు దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

340 కిలోల గంజాయి స్వాధీనం

తగరపువలస: ఆనందపురం మండలం చందక, పాడుగుపాలెం గ్రామాల మధ్య పోలీసుల తనిఖీల్లో 340 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.34 లక్షలు ఉంటుందని అంచనా. వివరాలివీ.. చందక, పాడుగుపాలెం మధ్య శుక్రవారం వేకువజామున 3.30 గంటల సమయంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు ఆటోలు, ఒక ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 340 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 170 ప్యాకెట్లుగా గంజాయి తరలిస్తున్న వారిలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్టు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వీరిలో ఇద్దరిది ఒడిశాలోని మల్కాజ్‌గిరి. మిగిలిన నలుగురు పాడేరుకు చెందిన వారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయిని, వాహనాలను సీజ్ చేశారు.

రెండేళ్లుగా గంజాయి తరలింపు

స్థానికులు తెలిపిన వివరాల చందక పంచాయతీలో రహదారి పక్కన వ్యవసాయ భూమిలో షెడ్డు నిర్మించి రెండేళ్లుగా పాడేరు, ఒడిశా నుంచి తీసుకువస్తున్న గంజాయిని అందులో నిల్వ చేస్తున్నారు. నగరానికి చెందిన వ్యక్తులు తరచూ కార్లలో ఈ షెడ్డు దగ్గరకు వచ్చి గంజాయి పార్సిళ్లు పట్టుకుని వెళ్తుంటారని తెలిసింది. ఉదయం నుంచి జరిగిన హైడ్రామా ప్రకారం తనిఖీల్లో భాగంగా వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు అధికారులు చెప్పడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతిని ప్రేమిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించి పర్యావరణాన్ని రక్షించాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేతుల మీదగా మామిడి, నేరేడు, నల్లమద్ది, పనస, మామిడి మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణం కాపాడాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.రానున్న తరాలకు మంచి ఆరోగ్యం ఇవ్వాలంటే మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. వనాల వృద్ధితోనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పంటలు పండుతాయని, దేశంలో ఆహర ఉత్పత్తుల కొరత ఉండదన్నారు. ఎంపీపీ సీతమ్మ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓ.ఎస్.ఎన్.మూర్తి, పీఆర్ ఏఈ గోపాలకృష్ణ, హెచ్‌ఎం మణిక్యాలరావు, సర్పంచ్‌లు సుభాష్‌చంద్ర, నరసింగరావు, నీలకంఠం, ఫారెస్టు సెక్షన్ అధికారులు నారాయణ, స్రవంతి, ఫారెస్టు బీట్ అధికారులు రుక్మిణి, శ్రీను ,రామారావు, నేతలు జగబంధు, మూర్తి, అర్జున్, తిరుపతి, జయదేవ్, రాజారావు, వీఆర్‌వో రమేష్, ఉపాధ్యాయులు భాగత్‌రాం, మధుసుందన్, గిరీష్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించిన రక్తధాన శిబిరంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

పాడేరు : రోడ్డు ప్రమాదాలు, గర్భిణుల ప్రసవం, రక్తహీనత బారిన పడటం ద్వారా అత్యవసర సమయాల్లో రక్తం అందక చాలా మంది అభాగ్యులు మృతి చెందుతున్నారని సమాజంలో ప్రతి ఒక్కరు తనవంతు సామాజిక బాధ్యతగా గుర్తించి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ పిలుపునిచ్చారు. పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ డిపో ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తధాన శిబిరాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 16 యూనిట్ల రక్తం సేకరించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా రక్తధాన శిభిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్‌భాషా, డాక్టర్ ఎస్. రాజీవ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పల్టాసింగి సూర్యారావు, జయలక్ష్మి, కోటేశ్వరరావు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాదాల నాణ్యతలో రాజీ పడొద్దు

- సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: భక్తులు హుండీల్లో నగదు వేస్తేనే మనకు జీతాలు వస్తాయని.. ఆ విషయాన్ని గుర్తెరిగి.. వారు సంతృప్తి చెందేలా సేవలందించాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఉద్యోగులను ఆదేశించారు. ప్రసాదాల నాణ్యతలో రాజీ పడొద్దని ఆ విభాగం అధికారులు, సిబ్బంది, శ్రీవైష్ణవ స్వాములకు స్పష్టం చేశారు. సింహగిరిపై ప్రసాదాల విక్రయ కేంద్రంలో శుక్రవారం ఈవో తనిఖీలు చేపట్టారు. ప్రసాదాల నాణ్యత, రుచిపై ఆరా తీశారు. అనంతరం పులిహోరా, లడ్డూలను పరిశీలించి.. వాటి రుచి చేశారు. సింహాచలంలో పులిహోరా, లడ్డూల రుచి అద్భుతంగా ఉంటుందన్న భక్తుల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా.. తయారు చేయాలని శ్రీవైష్ణవ స్వాములకు సూచించారు. అనంతరం లడ్డూ చుట్టే సిబ్బంది వద్దకు వెళ్లి బరువు సరిగ్గా తూచి చుడుతున్నారో లేదో పరిశీలించారు. ప్రసాదాల నమూనాలను నిత్యం రుచి చూడాలని.. బాగుంటేనే విక్రయించాలని అధికారులకు స్పష్టం చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాల ని పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. ఆయన శుక్రవారం గూడెంకొత్తవీధి మండలంలోని పెదవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. స్వల్ప అనారోగ్యానికి గురై అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవరాపల్లి ఎంపీటీసీ కృష్ణమూర్తిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది 24గంటలూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కోరారు. ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ వంశీకృష్ణ, వైస్‌ఎంపీపీ దేముడు, వైద్యాధికారి పృధ్వీషా, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెదవలస ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవరాపల్లి ఎంపీటీసీ కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు

కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు అరుదైన చికిత్స



వైద్యులను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలిక ఎండోక్రైనాలజీ విభాగంలో చికిత్స పొందుతోంది. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపిన వివరాలివీ.. అల్లూరి జిల్లా కొయ్యూరు ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలిక ఒక్కసారిగా బరువు పెరగడం, ఆయాసం, అధిక ఆకలి, దాహం, అతి మూత్రం, తలపై జుట్టు రాలటం, మిగతా శరీర భాగాల్లో అధికంగా జుట్టు పెరగడం, ముఖం వాపు తదితర లక్షణాలతో బాధ పడుతోంది. ఈ నెల 3న బాలికను ఆమె తల్లిదండ్రులు కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. పిల్లల సర్జరీ వార్డులో ఆమెను చేర్పించి.. ఆ విభాగాధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో చికిత్స అందించారు. బాలికకు అధిక రక్తపోటు, వీపు పైభాగాల్లో అధికంగా కొవ్వు చేరడం, చర్మం మీద మచ్చలు, ముఖం ఉబ్బి ఉండడం వంటి లక్షణాలను గుర్తించి 'కుషింగ్స్ సింద్రోమ్'గా నిర్ధారించారు. బాలికకు రక్త పరీక్షలు, స్కానింగ్ చేసి.. ఎడమ మూత్రపిండం పైభాగంలోని అడ్రినల్ గ్రంథిలో 3X3 సెంటీమీటర్ల పరిమాణంలో కణితి ఉన్నట్లు నిర్ధారించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో బాలిక మెదడులోని నాళాల్లో రక్తం గడ్డ కట్టి, ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడంతో పలు విభాగాల వైద్యులు వెంటిలేటర్‌పై ఆమెకు చికిత్స అందించారు. ఈ క్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న లాప్రోస్కాపిక్ శస్త్ర చికిత్స విధానం ద్వారా కణితి తొలగించారు. శస్త్ర చిక్సిత అనంతరం బాలిక ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడింది. రక్తపోటు సాధారణ స్థితికి చేరింది. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ శుక్రవారం బాలికను పరామర్శించి.. ఆమెకు చికిత్స అందించిన వైద్యులు కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కరరెడ్డి, హసంతి, కల్యాణ్, శ్రీనివాస్, ప్రవీణ్, నాగరాజు, జూనియర్ వైద్యులను అభినందించారు.

పాత కక్షలతో తల్లీకొడుకులపై దాడి

అరకులోయ రూరల్ : పాత కక్షలతో గిరిజనుడిపై గిరిజనేతరుడు గొడ్డలితో దాడికి పాల్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. సుంకరమెట్ట పంచాయతీ బంగ్లవలస గ్రామంలో ప్రతి శుక్రవారం గ్రామస్తులు కలిసి పారిశుధ్య పనులు నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే శుక్రవారం గ్రామస్తులతో కలిసి పారిశుధ్య పనులు చేస్తున్న తల్లి కొడుకు కొర్రా చిన్నమి, కొర్రా చిట్టిబాబులపై అదే గ్రామానికి చెందిన గిరిజనేతరుడైన కార్తిక రాజ్‌కిరణ్ అనే వ్యక్తి పాత కక్షలతో దాడి చేశాడు. చిన్నమి దుస్తులు చింపి విచక్షణారహితంగా దాడి పాల్పడ్డాడని, చిట్టిబాబుపై గొడ్డలితో దాడి చేశాడని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో గాయాలపాలైన బాధితులను అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామస్తులతో కలిసి బాధితుడు చిట్టిబాబు భార్య రత్నాలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. బాధితులను గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు, మండల నాయకులు రామరావు పరామర్శించారు. నిందితుడు కార్తిక రాజ్‌కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి కొడుకు, చిన్నమి, చిట్టిబాబు

ఆదివాసీలకు డిజైన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

డాబాగార్డెన్స్ : లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ (ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీలకు సీతంపేట గ్రామంలో డిజైన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్, సవర ఆదివాసీలకు పెయింటింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. లేపాక్షి ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత, ఎండీ బాలసుబ్రహ్మణ్యం, ఈడీ ఎం. విశ్వ, లేపాక్షి కార్య నిర్వహణాధికారి ఆసపు కార్తీక్ నేతృత్వంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్, పెయింటింగ్ శిక్షణ, ట్రైబల్ ఆర్ట్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం తిలకించారు. కళాకారుల ప్రతిభను గుర్తించిన కలెక్టర్ వారిని అభినందించారు. శిక్షణకు పూర్తి సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. అంతరించిపోతున్న ఆదివాసీ ట్రైబల్ ఆర్ట్‌కు పూర్వ వైభవం రాబోతుందన్నారు. అంతే కాక ఎంతో మంది ఆదివాసీలకు ఉపాధి కల్పించిన వారం అవుతామని, ప్రతి ఒక్కరూ ఆదివాసీలు రూపొందించిన వస్తువులు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవీ రమణ, డిజైనర్లు ధర్మ, తేజస్వి, కిషోర్, స్థానిక కన్వీనర్ అనిల్‌కుమార్, ఆర్ట్ టీచర్ గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట టోకరా

మద్రిపాలెం: హైదరాబాద్‌కు చెందిన మాచర్ల జగన్నాథం గౌడ అనే వ్యక్తి రామాటాకీస్ ప్రాంతంలోని ఉంటూ.. రెడ్డి కంచరపాలెంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఎంఅండ్‌డబ్ల్యూ(హ్యూమన్ యూనిక్ గోల్స్) అనే సంస్థ పేరిట జీవనోపాధి కల్పిస్తానని గృహిణులు, మహిళలను నమ్మబలికాడు. సుమారు 350 మహిళల నుంచి రూ.1,300 చొప్పున సేకరించాడు. మహిళల అర్హతను బట్టి మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, తదితర విభాగాల్లో చేర్పించుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. ఇంటి యజమానికి అద్దె చెల్లించి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించాడు. ఇదంతా జూలైలో జరిగింది. ఆ తర్వాత అతని గురించి వాకబు చేసిన మహిళలు, గృహిణులు.. తమను మోసం చేశాడని గ్రహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీఆర్ఎం భద్రతా తనిఖీలు

అరకు-కొత్తవలస సెక్షన్ పరిధిలో పనుల పరిశీలన

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ కేకే లైన్ కొత్తవలస – అరకు మధ్య శుక్రవారం భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్‌స్టేషన్లు, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడల వంటి పలు ఆధునికీకరణ, అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడే అవకాశమున్న ప్రాంతాలను నిశితంగా పరిశీలించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్‌లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగిపోయేందుకు పాటించవలసిన అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, వివిధ విభాగాలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అరకు-కొత్తవలస సెక్షన్ పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్